
# పెళ్ళికానుక

ఎం.ఆర్. అరుణ కుమారి

"పెళ్ళికానుకగా వీడిలాంటి వింత కోరిక కోరాడేమిటండీ మరీ చోద్యంగా?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది ఇంద్రాణమ్మ భర్తను. "అయినా మీరైనా చెప్పొద్దూ, అలాంటి గొంతెమ్మ కోరికలు కోరడం తగదనీ! పైగా పెండ్లి పత్రికల్లోనే అచ్చేయిస్తాడా? అవ్వ! కానుకలు తేవద్దని అచ్చెయ్యడం చూశాముగానీ, ఇలా స్కూల్లో యూనిఫాం వేసుకు రమ్మన్నట్లుగా - అందర్నీ "ఫలానా" కానుకే తేవాలనడం నేనెక్కడా విన్లేదుబాబూ!"




శేషేంద్రగారు మౌనంగా ఏదో పుస్తకం పట్టుకు కూచున్నారుగానీ ఏమీ బుర్రకెక్కడం లేదు చదివేది! ఎంత వద్దనుకున్నా, భార్య మాటలు చెవుల్లో పడ్తూనే ఉన్నాయి. కానీ ఏం చెప్పాలో ఆయనకీ తోచడం లేదు.

తేజ తన పెండ్లి పత్రిక ఇచ్చినప్పట్నుంచీ, పత్రికలో వాడి కోరిక 'ఎర్ర' అక్షరాల్లో మెరుస్తూ కన్పించినప్పట్నుంచీ, తను ఆశ్చర్యంగా వాడివేపు చూస్తే తన కాళ్ళదగ్గర నేల మీదే వాడు బాసిం పట్టు వేసుక్కూర్చుని తన కోరికలోని అంతరార్థం, ఆవేదనా వివరించినప్పట్నుంచీ - ఆయన 'ఇదీ' అని నిర్వచించలేని ఒకానొక 'అవస్థ'తో కొట్టుమిట్టాడుతున్నారు. అశాంతి సాగరంలో మునకలేస్తున్నారు.

గుడ్డు ప్రాణిగా ఎదగడంలో పరిణామ దశలు అవలీలగా పిల్లలకు బోధించిన ఆయన - ప్రస్తుతం తను ఉన్న 'దశ' మాత్రం ఏదో తేల్చుకోలేక సతమతమవుతున్నారు. విద్యార్థిగా అయిదేళ్ళ వయసులో తన దగ్గరకొచ్చి - తనచేత అక్షరాభ్యాసం చేయించుకొని - తన తెలివితేటలతో, ఆత్మీయాను రాగాలతో - అనతికాలంలోనే తన ప్రియశిష్యుడై, పిల్లల్లేని తమకు మానసపుత్రుడై - 'ఇంతింతై... వటుడింతై' నట్లుగా - ఎదిగి - చదివిన పెద్ద చదువులు విదేశాల్లో ఉద్యోగాన్ని సంపాదించిపెట్టినా - ఎదిగి - చదివిన పెద్ద

## కళ్ళార్పడం కష్టమైతే నా తప్పు కాదు!

సినీ హీరోయిన్‌గా కన్నా సెక్సీగా ఫోజులివ్వడం ద్వారా సినీజనానికి బాగా పరిచయమైన భామ సమీరారెడ్డి 'ప్లాన్' చిత్రంపై చాలానే ఆశలు పెట్టుకుంది. "సినిమాలో నన్ను చూసినవాళ్ళు కళ్ళార్పడం కూడా కష్టమే. మీరో కొత్త సమీరను చూడబోతున్నారంటూ" హొయలు పోయింది. 'అంటే సెలీనాకి పోటీగా ఎక్స్‌పోజింగ్ చేశావా?' అనడిగితే "అదంతా సినిమా చూసి మట్లాడండి. సినిమాలో మీకు కళ్ళార్పడం కష్టమైతే అది నా తప్పు మాత్రం కాదు" అంటూ టాటా చెప్పే సింది.



చదువులు విదేశాల్లో ఉద్యోగాన్ని సంపాదించి పెట్టినా - కన్న ఊరిని, కన్నవారిని, పెంచిన ప్రేమను, పెంచుకున్న ప్రేమనూ - మరచిపోకుండా వచ్చి - తమకు కన్నులపండుగ చేసిన తేజను చూస్తుంటే తన మనసుకు గర్వంతో రెక్కలు మొలిచి ఆనంద వినీలాకాశంలో విహంగమై విహరించిన మాట నిజం!

పేదరికమనే పంకిలంలో విరిసిన పంకజం - పూజిత! పూజారిగారమ్మాయి. తన చిన్ననాటి నేస్తాన్నే జీవిత నేస్తంగా చేసుకోవాలనుకుంటున్న కోరికనే బండరాయిని తన నెత్తిన పెట్టి నిశ్చింతగా నిట్టూర్చాడు. ఆ బండరాయిని 'సన్నెకల్లు'గా తను మార్చగలడన్న నమ్మకం నిట్టూర్చిన నిశ్చింతది!

అయినా, వాడు చిన్నప్పట్నుంచీ అంతేగా! తనకు ఏం కావాలన్నా తనకు చెప్పి ఓ నిట్టూర్పు వదిలేసేవాడు. తర్వాతి తంటాలేవో తను పడి, వాడు అనుకున్నది సాధించే మార్గం సుగమం చేస్తాడన్న విశ్వాసం విడిచే విశ్వాసమది!

ఎలిమెంటరీ స్కూలు చదువయ్యాక తేజ్ తల్లి దండ్రులు ఇక చదువాపేసి తమతోబాటు కూలిపనులకు రమ్మంటున్నారని వచ్చి ఏడ్చాడు తనకు చదువుకోవాలనుందని! వాడు ఏడిస్తే తను భరించగలడా? తేజ తల్లిదండ్రులకు నచ్చజెప్పి పక్క టౌన్లోని హైస్కూల్లో చేర్పించాడు తనే ఫీజులు కట్టి. యస్.యస్.సి. అయ్యాక ఇక ఏదో ఒక పన్లో స్థిరపడమని తల్లి దండ్రులు ఒత్తిడిచేస్తే - ఆ సంఘర్షణ - ఇంద్రాణి పెంచిన ప్రేమ తట్టుకోలేక - వాడిని కాలేజీలో చేర్పించమని - తనను ఒత్తిడిచేసింది. ఆఫీసుల చుట్టూ తిరిగి, తెలిసినవారిని పట్టుకొని -వాడికి స్కాలర్‌షిప్పులు ఏర్పాటుచేశాడు. పుస్తకాలు కొనిచ్చాడు. అవసరమైన ఆర్థిక సాయం చేయడం, రాత్రిళ్ళు, తెల్లవారు ఝాములూ తన నిద్రను చంపుకొని వాడిలోని ప్రతిభకు ప్రాణం పోశాడు. తన శ్రమ, వాడి శ్రద్ధా వృథా పోలేదు. ప్రతి పరీక్షలోనూ ర్యాంకుల పంటలే!

"నేనిలా చెవి కోసిన మేకలా అరుస్తూనే ఉన్నాను. మీరేమీ మాట్లాడో ఏమిటండీ?" చిరుకోపంతో గట్టిగా ప్రశ్నించింది ఇంద్రాణమ్మ.

ఆనకట్టవద్ద బలవంతంగా ఆగిన నీటి ఒరవడిలా ఆయన ఆలోచనా పరవళ్ళు ఆమె ప్రశ్నతో ఆగి ఈ లోకంలోకి వచ్చారు శేషేంద్ర గారు.

"ఏం మాట్లాడమంటావు ఇంద్రాణీ!" నెమ్మదిగా ప్రశ్నించారాయన.

నిజమే! తానేమీ మాట్లాడలేకపోయాడు. తేజ తన కోరికను విశదీకరిస్తుంటే తను సంభ్రమాశ్చర్యాలతో తబ్బిబ్బు పడిపోయాడు. ఆనందంతో ఉబ్బిపోయాడు బెలూన్లా! అంతలోనే ఏదో శంకా ముల్లుకు గుచ్చుకొని ఆ బెలూన్ టప్పుమని పేలిపోతే నిరాశతో నిరసించిపోయాడు. 'ఇది జరిగే పనేనా?' అన్నట్లు తను బేలగా చూస్తే నవ్వేశాడు చిన్నగా.

"ఆటంకాలు, అభ్యంతరాలు, అవహేళనలూ లేకపోతే అది మంచిపని ఎలా అవుతుంది మాస్టారూ?" వాడి చిరుదరహాసంలో వెల్లివిరుస్తున్న ఆత్మవిశ్వాస వెలుగుల్ని చూపి, నిజానికి తన ఆలోచన గొంగళిపురుగు దశలోనే ఉన్నందుకు సిగ్గుపడ్డాడు.

ఆలోచనల ఆకుల్ని మేసి, ఆచరణల సాధ్యాసాధ్యాల దారాలను అవిశ్రాంతంగా గ్రహించి, ఆ గూటిలో ఆ ఏకాంతంలో నిర్విరామ పరిణామ దశల్లో పరిపూర్ణమై విప్పారిన రెక్కలతో ప్రతి ఒక్కరి చేతిలో వాలిన వాడి కోరిక విహంగం ఎందరి ఆదరణకు నోచుకోగల దన్న ఆలోచన జీవితానుభవ ఆకుపై తుషార బిందువై కలవర పెడుతోంది. ఆ సందిగ్ధత నుండి తనే ఇంకా బయటపడలేకపోతున్నాడు. ఇక భార్యకే మని చెప్పగలడనీ?!?

"తొలి పత్రిక మీకే ఇచ్చాడుగా? అప్పుడొనా చెప్పకపోయారా?"

"బాగుంది. శుభలేఖలన్నీ అచ్చేసేక.. ఏం చెప్పను? అయినా అది వాడిష్టం! వద్దనడానికి నేనెవర్ని?"

"అదేంమాట! వాడిని మన స్వంత బిడ్డలా చూసుకోలేదా? మీరు చెబితే వాడు కాదంటాడా?" తన ముంజేతి మీది వాలిన ఏ తెల్ల కాకినో చూసినంత ఆశ్చర్యం ఆమె మాటల్లో! కాదనడని కాని మాటలు చెప్పవచ్చా? అయినా వాడిప్పుడంత కోరరానిది ఏం కోరాడని? వాడిది వింతకోరికే కావచ్చుగానీ, గొంతెమ్మ కోరిక కాదుగా?" సాలోచనగా చూశాడాయన.

"కాదా? అందుకేనా ఊరంతా అట్టుడికినట్టు ఉడికిపోతోంది? అసలు వాడి పెళ్ళికి ఒక్కరన్నా వస్తారా? మనం కూడా ఎలా వెళ్ళగలమని?"

"ఇంద్రాణీ!" శేషేంద్రగారు వారింపుగా చూశారు. "అవేం మాటలు? చికాగోలో ఏ దొరసాన్నో పెళ్ళాడే అవ

కాశం లేకనా వాడింతదూరం వచ్చాడు? ఇక్కడ.. మనందరి మధ్యా.. మన ఊరి అమ్మాయినే పెళ్ళాడాలన్న పెద్ద మనసుతో వాడొస్తే.."

"నిజమేకానీ, వాడి కోరిక.."

"కోరినంత మాత్రాన అందరూ ఇచ్చేస్తారా? అర్థం చేసుకున్నవాళ్ళు ఇస్తారు. లేకపోతే లేదు. వాడేం బలవంతపెట్టట్లేదు కదా!"

"కానీ.."

"పిచ్చీ! పొద్దున పక్కింటి పాప కాఫీ పొడి కావాలని వచ్చిందిగా! డబ్బాతో ఉన్నదంతా ఇచ్చేశావా?"

"ఆ! అంతా ఎందుకిచ్చేస్తానూ? ఓ చెంచాడు... అంతే! అంతా ఇచ్చెయ్యడానికి నేనేం వెర్రిదాన్నా?" అన్నట్లు చూసిందావిడ.

"ఏం? అంతా ఇచ్చెయ్యకపోయావా?" ప్రశాంతంగా ప్రశ్నిస్తున్న భర్తవేపు ఆశ్చర్యంగా చూసిందే తప్ప బదులివ్వలేదు ఇంద్రాణమ్మ.

"చెప్పు ఇంద్రాణీ!" సన్నగా నవ్వుతూ రెట్టించి అడిగాడాయన.

"ఏం చెప్పమంటారు? అవసరానికి ఎవరన్నా ఏదన్నా అడిగితే అంతా ఇచ్చేస్తారా? తగు మాత్రంగా ఇస్తారుగానీ!" రుసరుసలాడింది ఇంద్రాణమ్మ.

"ఇదీ అంతేగా మరి! మనకున్నదాంట్లో కొద్దిగా అవతలివారి అవసరానికి ఇచ్చినంత మాత్రాన మన ప్రాణాలు పోతాయా? పైగా పోయే ఏ ప్రాణాన్నో కాపాడగల్గినవారమవుతాం కూడా కదా! ఆలోచించు ఇంద్రాణీ! లక్షల సంవత్సరాల వరకూ కీర్తి నిలిచి ఉండేట్లు ఏదో ఒక గొప్ప ఘనకార్యాన్ని సాధించడంకంటే బాధామయ జీవి అయిన ఎదుటి మనిషికి ఒక్క క్షణం సుఖాన్నియడమే మహోన్నత ఆదర్శం కాదా? అనంతమైన కాలంలో అరసెకను కూడా అపారమైన విలువ కల్గినదే కాదా? ఆ అరసెకను నిర్లక్ష్యంతో కొన్నిటిని ఒకసారి పోగొట్టుకుంటే తిరిగి తెచ్చుకోగల శక్తి మనకుందా?"

భర్త మాటల్లోని ఔచిత్యం తనలో స్రవిస్తున్న ఆలోచనామృతాన్ని గ్రోలుతూ చాలాసేపు మౌనంగా ఉండిపోయింది ఇంద్రాణమ్మ

"మీరు చెప్పేది ముమ్మాటికీ నిజమే! కానీ, వివాహమంటే బంధుమిత్రుల కలయికలు, కలసి విందు భోజనాలు అనుకుంటారుగానీ, ఆస్ప త్రులు, మందులూ, రక్తం పిండడాలూనా? అని జనాలు భయపడిపోతున్నారేమిటి?" సాలోచనగా చూసిందావిడ.

"భయపడాల్సిన అవసరమే లేదు. దీనివల్ల వారి చిత్తశుద్ధే కాదు రక్తశుద్ధి కూడా తెలుస్తుంది. పరోపకారమే కాదు స్వలాభమూ ఇమిడి ఉంది. ఒక దెబ్బకు రెండు పిట్టలు."

"ఆ విషయం మీకు తెలిస్తే సరా? అందరికీ అర్థమవద్దా?"

ఇంద్రాణమ్మ లేచి వంటింట్లోకి వెళుతూ యధాలాపంగానే అన్నా.. ఆ మాటలు ఏదో అనిర్వచనీయ 'అవస్థ' తో ఆరాటపడ్తున్న ఆయన మనసును చెళ్ళున కొరడా దెబ్బల్లా తాకాయి. ఒకసారి కాదు.. రెండుసార్లు కాదు.. లెక్కలేనన్ని సార్లు! గడ్డకట్టిన మంచుపర్వతం బ్రద్దలై.. అందులోని జలం ఎగిసిపడ్డట్లుగా ఆయనలో ఏదో ఉద్రేకం! ఉద్వేగం!!

తనను ముక్కలు చెక్కలు చేస్తున్న ఉలి దెబ్బలకు భయపడితే, బాధపడితే శిల... మనోహర శిల్పమవుతుందా? మనోరంజితమై అలరారుతుందా? అజరామరమవుతుందా?" శిష్యుడితోబాటు గురువుకీ పిచ్చిపట్టినట్లుంది అన్న అవహేళనల వెల్లువలో తన వితరణ కొట్టుకుపోదు.

తేజ నిస్వార్థపూరితమైన పద్మం రేకుల్లాంటి మనసు పొరల్లో దాగిన విశ్వనర ప్రేమనే 'ఆర్తి'ని విస్పష్టపర్చడమే ఇప్పుడు తన ముందున్న కర్తవ్యం!

తారకలెన్ని ఉన్నా శశాంక ఒంటరి బాటసారే కావచ్చుగాక! కానీ తన లక్ష్యసాధనలో తేజ ఒంటరివాడై ఓడిపోవడానికి వీల్లేదు. ఎంత బాధకల్గించినా, ఎంత కన్నీరు పారించినా, హృదయాన్ని ఎంత శిథిలపరచినాసరే తేజ మనసులోని విశ్వ ప్రేమ సుమం వాడిపోవడానికి వీల్లేదు. ఎన్నో హృదయాల్లోకి తేజ మోసుకొస్తున్న కొత్త ఉషస్సులను అడ్డుకొంటున్న మూర్ఖత్వపు మనసు వాకిలి తెరవగల్గాలి. అంతే!

శేషేంద్రగారు చివాల్న లేచి, పై కండువా తీసి భుజాన వేసుకున్నారు. ఆయన అడుగులు ఉరకలేస్తున్న ఉత్సాహంతో "రచ్చబండ' వేపు వడివడిగా సాగిపోయాయి.


తేజ పెళ్ళికి ఊరి జనంతోబాటు బంధుమిత్రులు చాలామంది హాజరయ్యారు. శేషేంద్ర, ఇంద్రాణమ్మ - దంపతుల ఆనందం, హడావిడి వర్ణనాతీతం!

దాదాపు వెయ్యిమంది తేజ పెళ్ళి సందడిలో సంతోషంగా పాలు పంచుకుంటే వారిలో ఏడు వందలమంది తేజ కోరిక ప్రకారం "రక్తదానం" చేసి మరీ పెళ్ళి ముహూర్తానికి హాజరవడం నిజంగానే ఎంతోమందిని విస్మయపరిచింది.

*

## మురసోలి మారన్ మృతి

కేంద్రమంత్రి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి మేనల్లుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త, ద్రవిడ మున్నేట్ర కళగం సీనియర్ నాయకుడు మురసొలి మారన్ నవంబరు 22వ తేదీ రాత్రి 7.05 నిమిషాలకు కన్ను మూశారు. మారన్ వయస్సు 69 సంవత్సరాలు. ఈయన గత రెండున్నరేళ్ళ కాలంగా తీవ్రమైన హృదయ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారు. దాదాపు రెండున్నర నెలల క్రితం నుంచి మారన్ కోమాలోనే ఉన్నారు. మారన్ ద్రవిడ మున్నేట్ర కళగం సారథిగా ఆ పార్టీ అభివృద్ధికి తోడ్పడ్డారు. మురసొలి మారన్ మృతి పార్టీకే కాక, కరుణానిధికి కూడా తీరని లోటు. మారన్ మృతికి రాష్ట్రపతి అబ్దుల్ కలామ్, ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, తమిళనాడు రాష్ట్ర గవర్నర్ రామోహనరావు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీతో సహా పలువురు కేంద్ర మంత్రులు తమ సంతాపాన్ని తెలియ చేశారు. ప్రముఖ పార్లమెంటేరియన్‌గా, తొలి ప్రాంతీయ



భాషా ఛానెల్ సన్ టీవీ వ్యవస్థాపకుడిగా, జర్నలిస్ట్‌గా, ఫిల్మ్ మేకర్‌గా పలు రంగాలలో ఆయన తన ప్రతిభను చాటుకున్నారు. మారన్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్నాటక ముఖ్యమంత్రి ఎస్.ఎం.కృష్ణ, కేంద్ర మంత్రులు టి.ఆర్.బాలూ, జార్జ్ ఫెర్నాండెజ్, మాజీ ప్రధానమంత్రి గుజ్రాల్, తమిళనాడు రాష్ట్ర గవర్నర్ రామ్‌మోహనరావులతో పాటు పలువురు రాజకీయ నాయకులు, డి.ఎం.కె. కార్యకర్తలు మురసోలి మారన్ అంత్యక్రియలకు తరలి వచ్చారు. రజనీకాంత్, కమలహాసన్, నెపోలియన్, శరత్‌కుమార్, విక్రమ్, శివకుమార్, సత్యరాజ్, భాగ్యరాజ్ వంటి సినీ ప్రముఖులు దివంగత కేంద్రమంత్రికి నివాళులర్పించారు. ❋